క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి పైనాపిల్‌కాలనీలో ఉన్న జిల్లా మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలు, గృహిణులకు పలు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం అక్టోబరు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డొమెస్టిక్ డాటా ఆపరేటర్, హ్యాండ్ ఎంబ్రైడరీ, అసిస్టెంట్ బ్యూటీథెరపిస్ట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. రెండు నెలలపాటు అందించే శిక్షణ పొందేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండడంతో పాటు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళలు గడువులోగా దరఖాస్తు చేస్తుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు జత చేయాలన్నారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6281261415, 8333921389లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఘనంగా వైఎంసీఏ వార్షికోత్సవం

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ 50వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెమినార్ హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా విజయ ప్రధాన్, ఉపాధ్యక్షులుగా సదానంద మూసేస్, డైసీ బాబు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జి.మ్యాథ్యూ పీటర్, కోశాధికారిగా కె.ఇజ్రాయిల్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కృపాధాను కుమార్ వ్యవహరించారు. సంస్థ ప్రగతికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

జయలక్ష్మికి శంకరశాస్త్రి పురస్కారం



ఆర్ఎస్ జయలక్ష్మిని ఈమని శంకర శాస్త్రి పురస్కారంతో సత్కరిస్తున్న ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కళాప్రపూర్ణ ఈమని శంకరశాస్త్రి జ్ఞాపక పురస్కారం చెన్నైకు చెందిన ప్రముఖ డాక్టర్ ఆర్.ఎస్.జయలక్ష్మికి అకాడమీ అధ్యక్షుడు రామమూర్తి, ఉపాధ్యక్షుడు పేరాల బాలమురళి, రాజారావు, కార్యదర్శి చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, భుజంగరావు, జ్వాలాప్రసాద్ అందజేశారు. అనంతరం జయలక్ష్మి వీణ వాదన కచేరీ, తన మనవరాలు చారులతతో కలిసి శ్రావ్యంగా కీర్తనలను ఆలపించారు. చంద్రశేఖర్ వీణ, డాక్టర్ మండపాక రవి మృదంగం, విద్వాన్ రామకృష్ణ ఘట సహకారం అందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కృష్ణా కళాశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాలలో మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, గ్రీన్‌క్లైమేట్ టీం నేతృత్వంలో స్వచ్ఛత హీ సేవ, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్త్ర సంచులను వినియోగించాలని సూచించారు. అందరూ పర్యావరణహిత జీవన విధానాన్ని అలవరచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో మనోబందు ఫౌండేషన్ జాతీయ నాయకుడు భూపతిరాజు రామకృష్ణ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.లక్ష్మి, పద్మావతి, కృష్ణ కుమారి, జేవీ రత్నం పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణలో ఏఐ కీలకం

అగనంపూడి: క్యాన్సర్ ఇమేజింగ్ ఆధారిత డయాగ్నసిస్ సిస్టంపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఐఈఈఈ సీనియర్ సభ్యుడు విక్రాంత్ భటిజా, పూర్వాంచల్ విశ్వవిద్యాలయం సీఎస్ఈ హెడ్ వీర్ బహదూర్ సింగ్ లు మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కీలకంగా మారుతుందన్నారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు పాల్గొన్నారు.

ఎన్ఏబీహెచ్ హోదా కొనసాగేనా..?



పని చేయని బేసిన్

- అధ్వానంగా ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి నిర్వహణ
- ఎక్కడికక్కడే బయో మెడికల్ వేస్టేజీ
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- ప్రమాదకరంగా వార్డుల్లోని సీలింగ్
- పరిస్థితి ఇలానే కొనసాగితే ఎన్ఏబీహెచ్ రద్దయ్యే ప్రమాదం

బీచ్ రోడ్డు: నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) హోదా పొందిన మొట్టమొదటి ప్రభుత్వ ఆస్పత్రిగా పెదవాల్తేరులోని ఛాతీ ఆస్పత్రి రికార్డు నమోదు చేసింది. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుతం ఆ హోదా కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆస్పత్రులకు సాధ్యం కాని ఎన్ఏబీహెచ్ హోదా వచ్చేలా చేశారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఆ హోదా కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోవడంతోపాటు మరుగుదొడ్ల నిర్వహణ పూర్తిగా పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. మొత్తంగా ఆస్పత్రి నిర్వహణను గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా బయో మెడికల్ వేస్టేజీ నిర్వహణ

ఎన్ఏబీహెచ్ హోదా కేటాయింపులో అత్యంత కీలకమైన అంశం బయో మెడికల్ వేస్టేజీ వేరు చేయడం .. తరలించడం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అటువంటి కీలకమైన పనిని ఆస్పత్రిలోని కింది స్థాయి సిబ్బంది ఎక్కడపడితే అక్కడే విసిరేస్తున్నారు. ఎన్ఏబీహెచ్‌లో భాగంగా బయో మెడికల్ వేస్టేజ్ కోసం మూడు ప్రత్యేక గదులను నిర్మించారు. వాటిలో వేస్టేజ్‌ను వేరు చేసి వేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో ఆ గదులు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆస్పత్రి వెనుక వైపు పెద్ద మొత్తంలో బయో మెడికల్ వేస్టేజీ దర్శనమిస్తోంది. సాధారణ డస్ట్‌బిన్స్‌లోనే అన్ని రకాల వేస్టేజ్, మందులు, ఇంజక్షన్లు, ఇతర సామగ్రి పడేస్తున్నారు.



ప్రమాదకరంగా వార్డులోని సీలింగ్

ప్రమాదకరంగా వార్డుల్లో సీలింగ్

రోగులు చికిత్స పొందే వార్డుల్లోని సీలింగ్ రాలిపోయి ప్రమాదకరంగా కనిపిస్తోంది. అయినప్పటికీ అక్కడే రోగులకు వైద్యం అందిస్తున్నారంటే ఆస్పత్రిని అధికారులు ఎలా పర్యవేక్షిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎన్ఏబీహెచ్ హోదాలో కీలకమైన రోగుల భద్రతకు అధిక ప్రాధాన్యమిచ్చే అంశాన్ని ఉన్నతాధికారులు గాలికి వదిలేశారు. దీంతో రోగులు బిక్కుబిక్కుమంటూ వైద్యం పొందుతున్నారు. మరోవైపు ఆస్పత్రిలో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ కోసం సుమారు 50 మంది సిబ్బంది ఉన్నారు. కానీ ఆస్పత్రి ఆవరణలో ఎక్కడ చూసినా చెత్తే దర్శనమిస్తోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలైన వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్ బాటిళ్లు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. అవి కూడా ఆస్పత్రి ప్రధాన విభాగం ఎదురుగా ఉన్న ఆవరణలోనే కనిపిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇంత మంది పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ ఆస్పత్రిలోపాటు పరిసరాలన్నీ అపరిశుభ్రంగా తయారవడంపై రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..



ఎన్ఏబీహెచ్ బోర్డుతో ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి

తీరు మారకుంటే హోదా హుళక్కే

క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడిచే ఎన్ఏబీహెచ్ హోదా అనేది ఆస్పత్రిలో రోగికి అందించే నాణ్యమైన వైద్యం, పరిసరాల పరిశుభ్రత ఆధారంగా కల్పిస్తారు. బయో మెడికల్ వేస్టేజ్ వేరు చేసే పద్ధతి, రోగులకు సురక్షిత పద్ధతిలో వైద్య సేవలు అందించడం.. ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ హోదా పొందితే అంతర్జాతీయ స్థాయిలో ఆస్పత్రికి గుర్తింపు లభించినట్టే. అటువంటి గుర్తింపును ఈ ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. అయితే ప్రస్తుతం కూటమి పాలనలో ప్రభుత్వ ఆస్పత్రులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బయో మెడికల్ వేస్టేజీని ఆస్పత్రి ఆవరణలోనే పడేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్వహణతోపాటు ఆస్పత్రిలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వకపోవడంతో ఎన్ఏబీహెచ్ హోదా కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

- త్వరలో ఎన్ఏబీహెచ్ సభ్యులు ఛాతీ ఆస్పత్రిని సందర్శించి హోదాను సమీక్షించనున్నారు. ఈలోగా ఉన్నతాధికారులు తీరు మార్చుకుని చర్యలు చేపట్టకపోతే హోదా కొనసాగడం కష్టమేనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగుల భద్రతకు ప్రాధాన్యమివ్వడంతోపాటు పరిశుభ్రత, బయో మెడికల్ వేస్టేజీ తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఎన్ఏబీహెచ్ హోదా కొనసాగించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆస్పత్రి ఆవరణలో చెత్త, వాటర్ బాటిళ్లు



బహిరంగ ప్రదేశంలోని డస్ట్‌బిన్స్‌లో బయో మెడికల్ వేస్టేజీ



నిరుపయోగంగా ఉన్న బయో మెడికల్ వేస్టేజీ గదులు

బడ్డీలు తొలగించి.. జీవనాధారం తీసేశారు.!

- చిరు వ్యాపారుల గగ్గోలు
- ఎంవీపీ కాలనీలో 125 బడ్డీల తొలగింపు



తొలగించిన బడ్డీని తరలిస్తున్న దృశ్యం



ఎంవీపీ కాలనీలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బడ్డీలు తొలగిస్తున్న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ చేపట్టిన ఫుట్‌పాత్‌లపై షాపుల తొలగింపు మంగళవారం ఎంవీపీ కాలనీలో కొనసాగింది. జీవీఎంసీ జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ విభాగం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కూడలి నుంచి ఈ తొలగింపుల ప్రక్రియను మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించింది. ఏఎస్ రాజా సర్కిల్, ఉషోదయ కూడలి, రామలక్ష్మి అపార్ట్‌మెంట్ కూడలి, శివాజీపాలెం రోడ్లలో షాపుల తొలగింపు చేపట్టారు. అయితే షాపులు తొలగించొద్దు అంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నా సిబ్బంది తమ పని తాము చేసుకుపోయారు. దశాబ్దాలుగా ఈ షాపులపై ఆధారపడి జీవిస్తున్నామంటూ పలువురు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఏం కావాలంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం, జీవీఎంసీ చేపట్టిన ఈ హఠాత్తు చర్యలతో కుటుంబ జీవనాధారం కోల్పోయామంటూ వాపోయారు. అయితే బాధితుల ఆవేదనలు, ఆర్తనాదాల మధ్య టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగింపులు కొనసాగించారు.

ఏఎస్ రాజా కూడలి నుంచి తొలగింపు

ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కూడలి నుంచి ప్రారంభమైన తొలగింపు ప్రక్రియ శివాజీపార్క్ రోడ్డు వరకు కొనసాగింది. పొక్లెయిన్‌లు, భారీ కంటైనర్ లారీలతో వచ్చిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున బడ్డీలను తొలగించి తరలించారు. కొంత మంది బాధితులు కొంత సమయం ఇవ్వాలని కోరినప్పటికీ పట్టించుకోలేదు. మంగళవారం ఎంవీపీ కాలనీ పరిధిలో 125 బడ్డీలు తొలగించినట్లు జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసుదన్‌రావు వెల్లడించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రధాన రహదారుల్లో తొలగింపులు కొనసాగుతాయన్నారు. బడ్డీలు స్వచ్ఛందంగా తొలగించాలని ముందస్తుగా ఆయా ప్రాంతాల్లో తమ సిబ్బంది యజమానులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వడం లేదనడం సరికాదన్నారు. బుధవారం కృష్ణ కళాశాల రోడ్డులో తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

చిన్నపాటి వర్షానికే విమ్స్ రోడ్లు బురదమయం



విమ్స్ ఆవరణలో రోడ్డుపై నిలిచిన వర్షం నీటిని దాటుకుంటూ వెళ్తున్న రోగులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్) ఆవరణలో రోడ్లు పలుచోట్ల గోతులమయమయ్యాయి. వర్షం నీరు ఆ గోతుల్లో నిలిచిపోవడంతో రోగులు, వారి బంధువులు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఇక్కడి గోతుల్లో నీరు చేరి నిలిచిపోతోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు విమ్స్ గేటు నుంచి లోపలకు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. దీనిపై పెద్ద గోతులు కావడంతో రోగులు విమ్స్ లోపలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దీంతోపాటు వర్షం కురిసినప్పుడు గోతుల్లో నీరు చేరి బురదగా మారుతోంది. ఈ బురద నీటిని దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన రోడ్లను నిర్మించకుండా వదిలేశారని, ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించి రోడ్లకు మరమ్మతులైనా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏయూలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సిటీ స్థాయి యువజనోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ, జానపద, బృంద నృత్యాలు, సోలో సింగింగ్, గ్రూప్ సింగింగ్, నాటికలతో విద్యార్థులు అలరించారు. ఏయూ పరిధిలోని 30 అనుబంధ కళాశాలల నుంచి, క్యాంపస్ కళాశాలల నుంచి సుమారు 650 మంది వివిధ అంశాల్లో పోటీపడి సత్తా చాటారు. 150 మందికి పైగా వలంటీర్లు బృంద నాట్యాల్లో పాల్గొని సాంస్కృతిక శోభను విశ్వవిద్యాలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. ముఖ్యంగా థింసా నృత్యం, కోయదొరల విన్యాసం, కోలాటం, జాతర తదితర జానపద నృత్యాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోటీలు నిర్వహించారు. జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు బుధవారం అందిస్తామని జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ డి.సింహాచలం తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులుగా జోనల్ ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ఇతర సీనియర్ ప్రోగ్రాం అధికారులు వ్యవహరించారు.

ఏయూ చరిత్రను గ్రంథస్థం చేయాలి

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి శ్రీనివాస్



సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ చారిత్రక వికాసాన్ని గ్రంథస్థం చేయాలని కేంద్ర ప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ పబ్లిక్ గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి వి.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్ దృష్టితో ముందుకు సాగాలని సూచించారు. చరిత్రకారులు, విశిష్ట ఆచార్యులను సంప్రదించి ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రగతి, వికాసాలను గ్రంథంగా తీసుకొస్తే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా విశ్వవిద్యాలయాన్ని రానున్న 50 ఏళ్లలో ఏవిధంగా అభివృద్ధి చేయాలి..., ఏ దిశగా నడిపించాలనే అంశాలపై ఒక విజన్ సిద్ధం చేయాలని సూచించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఏయూ నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆచార్యులు నిరంతరం పరిశోధనలు జరపడం, పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించడం విధిగా భావించాలన్నారు. అదేవిధంగా ఒక ప్రత్యేకమైన స్టడీ గ్రూపులను రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ ప్రాంతంతో తన చిన్నతనంలో ఉన్న అనుబంధాన్ని, విశాఖలో చదువుకున్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆచార్యులను ఉద్దేశించి శ్రీనివాస్ ప్రసంగించడం సంతోషకరమన్నారు. అనంతరం సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం, జి.గిరిజ శంకర్, పద్మశ్రీ జి.శశిభూషణరావు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే చర్యలు

తాటిచెట్లపాలెం: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కి) ఫ్లో సహకారంతో వాల్తేర్ డివిజన్ సాలగ్రామపురంలోని సాగరమాల ఆడిటోరియంలో ప్రత్యేక అవగాహన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా హాజరై మాట్లాడారు. మహిళా సిబ్బంది కోసం పలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలపై ఎటువంటి లైంగిక వేధింపులు జరిగినా అందుకు కారకులను వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో గల పలు యూనిట్లలో మహిళలకు ప్రత్యేక రెస్ట్‌రూంలు, వాష్‌రూం, లాకర్స్, చేంజింగ్ రూంలు ఏర్పాటు చేయాలని సీనియర్ డీఈఎన్‌లను ఆదేశించినట్లు తెలిపారు. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ఈకార్వో ముందుంటుందని తెలిపారు. అంబ్రీన్ అంజుమ్ (ఫౌండర్, ఫిక్కిఫ్లో విజయవాడ చాప్టర్), డాక్టర్ వై. హేమ (మెంటార్, ట్రైనర్, ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్, పోష్), వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారి, రైల్వే ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలు పెంచాలని ఆందోళన



ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అద్దె బస్సుల డ్రైవర్లు

డాబాగార్డెన్స్: అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలు పెంచాలంటూ ఏపీఎస్ఆర్‌టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) మంగళవారం జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా సిటు జిల్లా కార్యదర్శి, ఏపీఎస్ఆర్‌టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వాల్తేర్ డిపో గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్రావు మాట్లాడుతూ వాల్తేర్, మద్దిలపాలెం, సింహాచలం ఆర్టీసీ డిపోల్లో అద్దె బస్సుల డ్రైవర్లకు జీతాలను యజమానులు పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పంద కాలం పూర్తయి 11 నెలలు కావస్తున్నా జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. బస్సు పాస్ సౌకర్యం, ప్రమాదాలు జరిగితే అద్దె బస్సుల డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవడానికి బీమా కల్పించాలన్నారు. ఈ నెల 15న సమ్మె నోటీస్ ఇచ్చామని, జీతాలు పెంచి, సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట పడతామన్నారు. కార్యక్రమంలో సింహాచలం డిపో అద్దె బస్సుల డ్రైవర్ల కార్యదర్శి సురేష్, వాల్తేర్, సింహాచలం, మద్దిలపాలెం డిపోల హైర్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

మార్మోగిన దుర్గమ్మ నామస్మరణ



ఏపీఎస్ఈబీ కాలనీలో దుర్గాదేవి మండపం వద్ద సంగీత కచేరీ



పీతలవానిపాలెం దుర్గాదేవి విగ్రహం వద్ద కుంకుమ పూజ చేస్తున్న భక్తులు



గాయత్రి దేవిగా పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డులోని పీతలవానిపాలెంలో శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల్లో రెండో రోజు మంగళవారం కుంకుమ పూజ వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ దంపతులు ఈ ప్రత్యేక పూజ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు పూజ అనంతరం నిర్వహణ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు.

- జీవీఎంసీ 15వ వార్డులో గల ఏపీఎస్ఈబీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల్లో రెండో రోజు మంగళవారం సాయంత్రం గాత్ర కచేరీ ఏర్పాటు చేశారు. విజయనగరానికి చెందిన నందూరి కాశీ ప్రసాద్ బృందంచే సంగీత విభావరి శ్రావ్యానందకరంగా సాగింది.

బీచ్‌రోడ్డు: పెద్దవాల్తేరులోని శ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితులు చండీ హోమం నిర్వహించారు. కలగా మురళీ కృష్ణ ప్రవచనం, రాగమాలిక సేవ సాంస్కృతిక సంస్థ వారి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈవో కె.గాయత్రి కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.